609) వరాళి

ప॥ అరిగాపులము నేము అంతర్యామివి నీవు। యిర్వై నీచెప్పినయట్టు యేమిసేతుమయ్యా॥

చ॥ గాలి ముడిగట్టినట్టు కాయము మోచితిమి। కాలము గోలిచితిమి కనురెప్పల।
జాలి రొప్పితిమి వట్టిసటలనే యేపొద్దు। యేల మెచ్చ వింకాను యేమిసేతుమయ్యా॥

చ॥ చుక్కలు లెక్కించినట్టు చూడగ మాజన్మములు। వుక్కున గర్మములకు వొడిగట్టితిమి।
తెక్కులను వెంట వెంట తిరిగేము బంట్లమై। యెక్కువాయ వెట్టి మాకు నేమిసేతుమయ్యా॥

చ॥ వాలు వొంగినటువలె బాయము మోచితిమి। నాలుక కెక్కినవెల్లా నమలితిమి।
యీలీల శ్రీవేంకటేశ ఇంత సేసితిమి। యేలినవాడవు ఇంకా నేమిసేతుమయ్యా॥